06102024-DIS-04_Layout 1 10/6/2024 2:20 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

గతాన్ని పరిరక్షిస్తేనే.. భవిష్యత్తు!

Er. వేదకుమార్ మణికొండ
98480 44713

ఇటీవల మనం ఒక శుభవార్త విన్నాం. ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో చేర్చాలని కోరుతూ 10 జియోలాజికల్ సైట్ల పేర్లను ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు కేంద్రప్రభుత్వం పంపించింది. ప్రస్తుతం దేశంలో 100కు పైగా జియో- హెరిటేజ్ సైట్లు ఉన్నాయి. వాటిలో 34 మాత్రమే నేషనల్ జియోలాజికల్ మాన్యుమెంట్స్‌గా గుర్తింపు పొందాయి. భూమికి సంబంధించిన చరిత్రను తెలుసుకోవడంలో కీలకపాత్ర పోషించే వాటిని లేదా భౌగోళికంగా ఎర్త్ సైన్స్ పరంగా ప్రాధాన్యం ఉన్న స్థలాలను జియో- హెరిటేజ్ సైట్లుగా వ్యవహరిస్తుంటారు.

నేడు అంతర్జాతీయ జియో డైవర్సిటీ డే

సాధారణంగా ఆర్కియలాజికల్ సైట్లకు చట్టపరమైన భద్రత ఉంది. జియో- హెరిటేజ్ సైట్లకు మాత్రం అలాంటి భద్రత లేదు. ఈ నేపథ్యంలోనే జియోలాజికల్ హెరిటేజ్ రక్షణే ధ్యేయంగా జియో-హెరిటేజ్ సైట్స్ అండ్ జియో రెలిక్స్ బిల్లు 2022 రూపు దిద్దుకుంది. త్వరలోనే ఇది చట్టరూపం దాల్చే అవకాశం కూడా ఉంది. ప్రపంచవ్యాప్తంగా 1200 దాకా ప్రపంచ వారసత్వ ప్రదేశాలున్నాయి. ఇందులో 43 భారత్‌కు చెందినవి. వీటిలో జియోలాజికల్ సైట్ ఒక్కటి కూడా లేదు.

జియోలాజికల్ సైట్లకు ఉన్న ప్రాధాన్యం నేపథ్యంలో అక్టోబర్ 6న అంతర్జాతీయ జియో డైవర్సిటీ డేను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జియోలాజికల్ సైట్లకు కూడా వివిధ రకాల గుర్తింపులు లభిస్తే వాటిని పరిరక్షించుకోవడం మరింత తేలికవుతుంది. దేశంలో వందకు పైగా అద్భుతమైన జియోలాజికల్ సైట్లు ఉన్నప్పటికీ, సమాజంలో మాత్రం వాటి పరిరక్షణ విషయంలో అంతగా అవగాహన ఉండటం లేదు. మహారాష్ట్రలోని లూనార్ క్రేటర్, మధ్యప్రదేశ్‌లోని భేడా ఘాట్, ఆంధ్రప్రదేశ్‌లోని గండికోట లోయ, తెలంగాణలోని పాండవుల గుట్ట.. ఇలా మరెన్నో అద్భుతమైన జియోలాజికల్ సైట్లు మన దేశంలో ఉన్నాయి. వీటిలో అనేకం పర్యాటక కేంద్రాలుగా మారాయే తప్ప వాటి భౌగోళిక ప్రాధాన్యం మాత్రం అంతగా ప్రాచుర్యంలోకి రావడం లేదు. వాటి రక్షణ విషయాన్ని ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇలాంటి వాటికి యునెస్కో గ్లోబల్ జియో పార్క్ గుర్తింపు లభిస్తే అవి మరింతగా ప్రాచుర్యంలోకి వచ్చే అవకాశం ఉంటుంది.

జియో పార్కుల భావనకు రెండు దశాబ్దాలకు పైగా చరిత్ర ఉంది. గ్లోబల్ జియోపార్క్స్‌నెట్‌వర్క్ (జీజీఎన్) 2024 అక్టోబర్ 6న అంతర్జాతీయ జియో డైవర్సిటీ డేను నిర్వహిస్తోంది. ఈ వేడుకను నిర్వహించుకోవడం అంతర్జాతీయ ప్రాధాన్యం ఉన్న జియోలాజికల్ హెరిటేజ్ సైట్లను కాపాడుకోవడం, భూమి చరిత్రకు గుర్తుగా వాటిని సంరక్షించుకోవడం తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ దినోత్సవం తోడ్పడుతుంది. ఈ సంవత్సరం గ్లోబల్ జియో పార్క్స్‌నెట్‌వర్క్ తన 20వ వార్షికోత్సవాన్ని కూడా నిర్వహించుకోవడం ఓ విశేషం. 2021లో యునెస్కో అంతర్జాతీయ జియోడైవర్సిటీ డేను ప్రకటించింది. నాటి నుంచి ఏటా ఈ దినోత్సవాలు జరుగుతున్నాయి.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 48 దేశాల్లో 213 యునెస్కో గ్లోబల్ జియోపార్కులు ఉన్నాయి. ఏటా కొత్తగా పది నుంచి ఇరవై దాకా విభిన్న స్థలాలను వాటికి జోడిస్తుంటారు. ఇదే విధమైన గుర్తింపును జాతీయ స్థాయిలో ప్రకటించడం కూడా ఈ స్థలాల పరిరక్షణకు, అవి ప్రాచుర్యంలోకి వచ్చేందుకు తోడ్పడుతుంది. ఇటీవలే తెలంగాణలో పాండవుల గుట్టకు ఈ విధమైన గుర్తింపు లభించింది. ఇలాంటి గుర్తింపు పొందిన ప్రాంతం తెలంగాణలో ఇదొక్కటే కావడం విశేషం. ఇప్పుడిప్పుడే జియో డైవర్సిటీ భావన ప్రజల్లోకి వెళ్తోంది. దక్కన్ హెరిటేజ్ అకాడమీ, పర్యావరణ, సాంస్కృతిక సంస్థలు, కొంతమంది వ్యక్తులు కొన్నేళ్లుగా ఈ అంశంపై విశేషమైన కృషి చేస్తున్నారు.

తెలంగాణ విషయానికి వస్తే ఇక్కడ భౌగోళిక ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి. పాండవుల గుట్ట హిమాలయాల కంటే ముందు నుంచీ ఉన్నదని చెప్పేందుకు ఆధారాలు లభ్యమవుతున్నాయి. అదే విధంగా కరీంనగర్, కొత్తగూడెం, ఆదిలాబాద్ తదితర ప్రాంతాల్లో రాక్షస బల్లుల శిలాజాలు, ప్రాచీన కాలపు తాబేళ్లు, ఇతర జంతువుల పాదముద్రలు కూడా బయటపడ్డాయి. ఇవన్నీ 160 నుంచి 200 మిలియన్ సంవత్సరాల కిందటివని అంచనా. హైదరాబాద్‌లోని మౌలాలీ పహాడ్‌కు కూడా అద్భుతమైన వారసత్వ ప్రాధాన్య చరిత్ర ఉంది. వీటిని గనుక మనం కోల్పోతే తిరిగి తెచ్చుకోలేం. యావత్ భూగోళ చరిత్ర వారసత్వం వాటికి ఉంది. అందుకే ఇలాంటి భౌగోళిక వైవిధ్య ప్రాంతాలను కాపాడుకునేందుకు ప్రజలే ముందుకు రావాలి. శిలా రాతి యుగం నుంచి లోహ యుగం దాకా ప్రాచీన చరిత్రను తమలో దాచుకున్న ప్రాంతాలెన్నో తెలంగాణలో ఉన్నాయి. పాండవుల గుట్ట, భువనగిరి, దేవరకొండ, ఉండ్రు కొండ, బొమ్మలమ్మ గుట్ట లాంటి ఎన్నో కొండలు, ప్రదేశాలు, ప్రాంతాలు దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఇప్పటికైనా ఈ ప్రాంతాల విశేషాలను భద్రపరిచేందుకు ప్రభుత్వం, ప్రజలు నడుం బిగించాల్సిన అవసరం ఉంది.

పాండవుల గుట్ట విషయానికి వస్తే.. తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇది ఉంది. 1990 కన్నా ముందే దీని ప్రాధాన్యం వెలుగులోకి వచ్చింది. ప్రాచీన కాలపు పెయింటింగ్‌లు, గుహలు, ప్రాచీన ఆవాసాలకు సాక్ష్యాధారాలు ఇక్కడ ఉన్నాయి. ఈ పెయింటింగ్‌లలో ఎద్దు, పులి లాంటి జంతువుల బొమ్మలు, వృత్తాలు, చతురస్రాలు, రేఖాగణిత సంబంధిత చిత్రాలు, స్వస్తిక్ చిహ్నం, విల్లు, బాణాలు, కత్తి లాంటి చిత్రాలు ఉన్నాయి.

భూమి చరిత్రకు సంబంధించిన విశేషాలను జియో హెరిటేజ్ సైట్లు అందిస్తాయి. భూమి గతాన్ని ఇవి చాటిచెబుతాయి. సెయింట్ మేరీ ఐలాండ్‌లోని కాలమర్ బసాల్ట్ కావచ్చు, లేదంటే మహారాష్ట్రలోని లోనార్ క్రేటర్ కావచ్చు.. ఇవన్నీ కూడా అగ్నిపర్వతాల పేలుళ్లు, ఉల్కాపాతం, ప్రాచీన మానవ ఆవాసాలు.. ఇలా ఎన్నో విశేషాలకు సాక్ష్యాలు. అందుకే జియోలజిస్టులు, ఇతర పరిశోధకులను ఇవి అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రాచీన కాలపు శీతోష్ణస్థితులు, భూమి పొరలు, పర్వతాలు రూపుదిద్దుకున్న క్రమం ఇలా మరెన్నో విశేషాలను ఇవి అందిస్తాయి.

దేశంలో ఇప్పటి వరకు 34 ప్రదేశాలను నేషనల్ జియోలాజికల్ మాన్యుమెంట్లుగా గుర్తించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఓల్కనోజెనిక్ బెడెడ్ బ్రెరేట్స్ (మంగంపేట), తిరుపతి ఎపర్రీన్ అన్ కన్ఫార్మిటీ (చిత్తూరు), తిరుమల సహజ శిలాతోరణం, ఎర్రమట్టి దిబ్బలు (విశాఖపట్నం) ఈ విధమైన గుర్తింపు పొందాయి. తెలంగాణలో పాండవుల గుట్టకు ఈ గుర్తింపు లభించింది. కేరళలో అంగాడిపురం లేటరైట్ (మల్లాపురం), వర్కాల క్లిఫ్ సెక్షన్ (వర్కాల), తమిళనాడులో నేషనల్ ఫాసిల్ ఉడ్ పార్క్ (పెరంబలూర్), సెయింట్ థామస్ చర్నోక్కైట్, కరాయ్ బద్లాండ్స్ ఫార్మేషన్ ఫాసిల్ పార్క్(పెరంబలూర్), గుజరాత్‌లోని ఎడ్డీ కరెంట్ మార్కింగ్ సెడిమెంటరీ స్ట్రక్చర్స్ (మహిసాగర్), రాజస్థాన్‌లోని సెంద్రా గ్రానైట్.. ఇలా పలు రాష్ట్రాల్లో మొత్తం 34 ప్రదేశాలు ఈ విధమైన గుర్తింపు పొందాయి.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో జియో హెరిటేజ్ సైట్లపై అవగాహన కల్పించేందుకు దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ లాంటి సంస్థలు ప్రయత్నిస్తున్నాయి. రెండు, మూడేళ్లుగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. జియో డైవర్సిటీ డే సందర్భంగా మౌలాలీ పహాడ్ వద్ద గతేడాది దక్కన్ హెరిటేజ్ అకాడమీ జియో హెరిటేజ్ వాక్, చర్చా కార్యక్రమాన్ని నిర్వహించింది. సంబంధిత రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 2022లో కూడా ఈ తరహా కార్యక్రమం తెలంగాణ అసెంబ్లీ ఎదురుగా ఉన్న నౌబత్ పహాడ్ వద్ద జరిగింది. ఈ ఏడాది అంతర్జాతీయ జియో డైవర్సిటీ దినోత్సవాన్ని పురస్కరించుకొని అక్టోబర్ 6న ఉదయం 9 గంటలకు హైటెక్ సిటీ సమీపంలోని ఫక్రుద్దీన్ గుట్ట (ఖాజాగూడ హిల్స్) వద్ద జియో హెరిటేజ్ వాక్‌ను దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ నిర్వహిస్తోంది. ఎఫ్‌బీహెచ్, సీడీఎస్, జేబీఆర్ఏసీ, టీఆర్ఏసీ లాంటి పలు సంస్థలు ఈ కార్యక్రమానికి సహకరిస్తున్నాయి.

స్థానికంగా జియోలాజికల్ చరిత్ర గురించి తెలుసుకునేందుకు జియో హెరిటేజ్ డే వీలు కల్పిస్తుంది. స్థానిక సంస్కృతులు, జీవవైవిధ్యం, పర్యావరణం, శీతోష్ణస్థితి మార్పులు లాంటి అంశాలు కూడా ఈ సందర్భంగా చర్చకు వస్తాయి. తమ ప్రాంత విశిష్టతలను కాపాడుకునేందుకు ప్రజలు ఏకతాటిపైకి వచ్చేందుకు ఈ దినోత్సవం వీలు కల్పిస్తుంది. పర్యాటకం పెరిగేందుకు తోడ్పడుతుంది. ప్రజలు తమ ప్రాంతంతో మరింతగా అనుబంధం పెంచుకునేందుకు తోడ్పడుతుంది. ఈ దినోత్సవాన్ని పురస్కరించుకొని వర్క్‌షాప్స్, సదస్సులు, క్షేత్ర పర్యటనలు, కళా ప్రదర్శనలు నిర్వహించాలి. దీని వల్ల స్థానిక విశేషాల పరిరక్షణకు స్థానికులు ముందుకు రాగలుగుతారు. మన దేశంలో జియో హెరిటేజ్ సంబంధిత అంశాలను జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పర్యవేక్షిస్తోంది. పర్యావరణ, సాంస్కృతిక సంస్థలు కూడా ఈ దిశలో తమ వంతు సహకారాన్ని అందిస్తున్నాయి. యూనివర్సిటీలు సైతం ఈ విషయంలో కీలకపాత్ర పోషించే అవకాశం ఉంది. విద్యార్థులతో వివిధ ప్రాజెక్టులు చేపట్టాలి.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జిల్లా చరిత్రలు, స్థానిక చరిత్రలకు ఎంతో ప్రాధాన్యం ఏర్పడింది. ఎన్నో పుస్తకాలు వచ్చాయి. అదే తరహాలో జియో హెరిటేజ్ సైట్ల విషయంలోనూ ఉద్యమంలా కృషి జరగాల్సిన అవసరం ఉంది. తెలంగాణలో ప్రస్తుతం పాండవుల గుట్ట మాత్రమే అధికారిక గుర్తింపు పొందింది. అలాంటి గుర్తింపు మరెన్నో స్థలాలకు వచ్చే అవకాశం ఉంది. అందుకు వీలుగా సరైన రీతిలో డాక్యుమెంటేషన్, లిస్టింగ్ అండ్ నోటిఫికేషన్ జరగాలి. అందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉదారంగా నిధులు మంజూరు చేయాలి. వివిధ ప్రభుత్వ విభాగాలను సమన్వయం చేస్తూ మరెన్నో ప్రాంతాలకు అధికారిక గుర్తింపు వచ్చేలా చేయాలి. ఇలాంటి గుర్తింపులు లభిస్తే తెలంగాణలో పర్యాటక రంగం కూడా వృద్ధి చెందే అవకాశం ఉంటుంది.

(వ్యాసకర్త: పర్యావరణవేత్త అండ్ అర్బన్, రీజినల్ ప్లానర్, హైదరాబాద్)

తెలంగాణ విషయానికి వస్తే ఇక్కడ భౌగోళిక ప్రాధాన్యం ఉన్న ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి. పాండవుల గుట్ట హిమాలయాల కంటే ముందు నుంచీ ఉన్నదని చెప్పేందుకు ఆధారాలు లభ్యమవుతున్నాయి. అదే విధంగా కరీంనగర్, కొత్తగూడెం, ఆదిలాబాద్ తదితర ప్రాంతాల్లో రాక్షస బల్లుల శిలాజాలు, ప్రాచీన కాలపు తాబేళ్లు, ఇతర జంతువుల పాదముద్రలు కూడా బయటపడ్డాయి.

అజ్ఞానపు పాలనతో రాష్ట్రానికి అరిష్టం

మిడి మిడి జ్ఞానపు ప్రభుత్వాలు, పరిపక్వత లేని పాలకులు ప్రజలకెప్పుడూ అరిష్టమే. ఈ పది నెలల అజ్ఞానపు పాలనను 'ప్రభుత్వం' అని అనాలో, మార్పు కోరిన ప్రజల దీనావస్థలు తెలిసి కూడా కాంగ్రెస్ పెద్దలు, ఆ పార్టీ హై కమాండ్ స్పందించని వైనాన్ని 'మూర్ఖత్వం' అని అనాలో అర్థం కావడం లేదు.

గోసుల శ్రీనివాస్ యాదవ్
98498 16817

రాష్ట్రంలో ఇటీవల జరుగుతున్న వరుస పరిణామాలకు తోడు పాలనపై పట్టులేని ప్రభుత్వం ఫలితంగా అన్నివర్గాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆత్మహత్యలు, హత్యలు పెచ్చరిల్లి అత్యాచారాల రోదనలు మిన్నంటుతున్నాయి. మొత్తంగా ఈ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నది సత్యం. ఈ సందర్భంలోనే పాలకులు దగ్గరుండి మరీ పేదల ఇండ్లు కూల్చివేస్తున్న తీరు దేశవ్యాప్తంగా చర్చకు దారితీస్తున్నది. హైదరాబాద్‌లో చెరువులు, నాలాల్లో ఆక్రమణలు పెరిగాయని ఇటీవల 'హైడ్రా' పేరుతో జరుగుతున్న బుల్డోజర్ కూల్చివేతల వల్ల పేదల హాహాకారాలు రోజురోజుకు మిన్నంటుతున్నాయి. పేదల ఆస్తులు, ఇండ్లు కూల్చేయాలని ముఖ్యమంత్రే స్వయంగా చెప్పడం, దానికి ఓ రాజకీయ పార్టీని మాత్రమే టార్గెట్ చేసి ఓ ఐపీఎస్ అధికారిని కమిషనర్‌గా నియమించడం విడ్డూరం. చెరువుల్లో, నాలాల్లో ఆక్రమణల కూల్చివేత కుతంత్రాలకు తెరలేపుతున్న తీరుకు చట్టబద్ధత కల్పించి మరీ బరి తెగించడం వారి అజ్ఞానానికి పరాకాష్ఠ అని చెప్పవచ్చు.

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న విధాన నిర్ణయాల మేరకు పనిచేయాల్సిన ఐపీఎస్ అధికారి 'అంతా నా ఇష్టం' అన్నట్టు వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో ఏ సమస్యలు లేనట్టు, అన్ని సమస్యలకు 'హైడ్రా'నే పరిష్కారం అన్నట్టు రేవంత్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో హైదరాబాద్ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతున్నది. తాజాగా మూసీ సుందరీకరణ పేరిట కూల్చివేతలకు శ్రీకారం చుట్టిన తీరు, బాధితుల గోడు చూస్తుంటే సర్కార్ బుల్డోజర్ వైఖరి స్పష్టంగా తెలుస్తున్నది.

1908లో మూసీకి భారీ వరదలు వచ్చి హైదరాబాద్‌ను ముంచేసింది. నాటి పాలకులు రాచరికులైనా ప్రజల విశ్వాసాలను గౌరవించారు. మూసీ వరదల నుంచి తన ప్రజలను కాపాడాలని ఆరో నిజాం పూజలు కూడా చేశారు. హైదరాబాద్‌లో వరదల ఉధృతిని తగ్గించడానికి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నిర్మాణాలకు రూపకల్పన చేశారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి, ఆ తర్వాత కొన్నాళ్లకు ఏర్పడ్డ ఉమ్మడి రాష్ట్రాన్ని ఎక్కువ కాలం పాలించింది కాంగ్రెస్ పార్టీయే. ఆ పార్టీ ఆ తర్వాతి స్థానం టీడీపీది. కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల హయాంలోనే సరస్సుల నగరం, ఉద్యాన నగరంగా విలసిల్లిన హైదరాబాద్ ఆక్రమణలకు గురైంది. ఇదంతా చరిత్ర. గత ప్రభుత్వం మూసీ ప్రక్షాళన కోసం ఒక ప్రణాళిక రూపొందించుకొని దానికను గుణంగా మూసీలోకి వచ్చే 90 శాతం మురుగు నీటి శుద్ధికి ప్రాధాన్యం ఇచ్చింది. ఎస్టీపీల నిర్మాణం చేపట్టింది. శుద్ధి అయిన నీరే మూసీలో కలిసేలా చర్యలు ప్రారంభించింది. ఆ ఎస్టీపీల నిర్మాణం పూర్తయితే భవిష్యత్తులో మూసీలోకి వెళ్లేది శుద్ధి చేసిన నీరే తప్ప మురుగు నీరు కాదు. కానీ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు మూసీ సుందరీకరణ చేస్తామని, నది పరీవాహక ప్రాంతాన్ని అద్భుతంగా తీర్చిదిద్ది, అక్కడ షాపింగ్ కాంప్లెక్స్‌లను నిర్మిస్తామని హామీ ఇచ్చింది. ఇరువై నాలుగు గంటలు అక్కడ కార్యకలాపాలు జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పింది. అధికారంలోకి రాగానే మూసీ సుందరీకరణ కోసం మొదట రూ.50 వేల కోట్లు, ఆ తర్వాత రూ.1.50 లక్షల కోట్లు అవసరమవుతాయని సీఎం, మంత్రులు వివిధ సందర్భాల్లో చెప్పుకొచ్చారు. మూసీ సుందరీకరణ చేస్తే, హైడ్రా పేరిట ఆక్రమణలు కూల్చివేస్తే రాష్ట్రంలో ఇక ఏ సమస్యలు ఉండవని.. ఇదే ఇందిరమ్మ రాజ్యం లక్ష్యమన్నట్టు ఏలికలు మాట్లాడుతున్నారు.

ప్రజా ప్రభుత్వమని చెప్పుకొంటూ ప్రజల విజ్ఞప్తులను పట్టించుకోవడం లేదు. ప్రజల ఆవేదనలను పరిగణనలోకి తీసుకోవడం లేదు. అందుకే ఇవాళ మూసీ పరీవాహక ప్రాంతంలో సర్వేకు వెళ్లిన అధికారులపై ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారు. ఇప్పటికే ముగ్గురు అమాయకులు తనువు చాలించారు. ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రిని, ఏ ప్రభుత్వాన్ని శపించని విధంగా సామాజిక మాధ్యమాల్లో ప్రజలు శాపనార్థాలు పెడుతున్నారు.

నిజానికి మురికికూపంగా మారిన మూసీ ప్రక్షాళన కోసం కేసీఆర్ ప్రభుత్వం 'మూసీ నది పరీవాహక ప్రాంత అభివృద్ధి సంస్థ-ఎంఆర్డీసీ'ని ఏర్పాటు చేసింది. మూసీ నదిని ప్రక్షాళన చేయడం, పరీవాహక ప్రాంతాలను సుందరీకరించడం తదితర పనులు ఎంఆర్డీసీ లక్ష్యం. మురికికూపంగా మారిన నది ప్రక్షాళన, సుందరీకరణ కోసం రూ.16,635 కోట్ల అవసరమవుతాయని, అప్పట్లో ఎంఆర్డీసీ, మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ అంచనా వేశాయి. రోడ్ల నిర్మాణానికి రూ.9,000 కోట్లు, 31 ప్రాంతాల్లో శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు రూ.3,866 కోట్లు, సుందరీకరణ కోసం రూ.2,000 కోట్లు అవసరమవుతాయని అప్పట్లో లెక్కగట్టారు. దీనికితోడు మూసీపై 14 వంతెనలు నిర్మించేందుకు రూ.545 కోట్లతో ప్రణాళికలు రూపొందించినట్టు అప్పటి మంత్రి కేటీఆర్ ప్రకటించారు. కాగా, ఈ పనులన్నీ జరగాలంటే మొదటిదశలో మురుగునీటి శుద్ధి జరగాల్సి ఉన్నది.

హైదరాబాద్ సీవరేజీ బోర్డు పరిధిలో రోజు దాదాపు 2వేల మిలియన్ గ్యాలన్ల మురుగునీరు విడుదల అవుతున్నట్టు ప్రభుత్వ గణాంకాలు చెప్తున్నాయి. కాగా, ఇందులో 772 ఎంజీడీల నీరు శుద్ధి చేయడానికి 25 ఎస్టీపీలు నిర్మించారు. మరో 1,259 ఎంజీడీల నీరు శుద్ధి చేయడానికి కొత్తగా 31 ఎస్టీపీల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. అంటే ఎక్కడా ఏ చిన్న కూల్చివేత, ఏ చిన్న ఇబ్బంది లేకుండా నగరవాసులను గత ప్రభుత్వం కాపాడుకున్నది. కానీ, హైదరాబాద్ ప్రజలు తమ వెంట లేరనో, లేక ఢిల్లీ పెద్దల వ్యాపారం కోసమో మూసీని పణంగా పెట్టి సుందరీకరణ పేరుతో పేర్చేగుతున్న మారణకాండ పైశాచిక పానలకు అద్దం పడుతున్నది. ప్రభుత్వానికి, ప్రధానంగా ముఖ్యమంత్రికి ఎంత ఆదరణ ఉన్నదో సామాజిక మాధ్యమాలను చూస్తే తెలుస్తున్నది.

హామీల అమల్లో వైఫల్యం, పథకాల లేమి, పాలనపై పట్టు లేకపోవడం వంటి కారణాలతో పాటు అజ్ఞానపు నిర్ణయాలతో అబాసుపాలవుతున్న తీరును కాంగ్రెస్ పార్టీ పెద్దలు అవలోకనం చేసుకోవాలి. ఇప్పటికైనా కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రం సురక్షితంగా ఉండాలంటే పాలనలో మార్పు రావాలి. కాబట్టి, అత్యవసరంగా ముఖ్యమంత్రి మారాలి. ఇందుకుగాను తెలంగాణలో ఉన్న కాంగ్రెస్ సీనియర్లు ఒక్కసారి తెలంగాణ స్థితిగతులను, భవితను అంచనా వేయాల్సిన అవసరం ఉన్నది. ఏ లక్ష్యం కోసం తెలంగాణ తెచ్చుకున్నమో ఆ లక్ష్య సాధన దిశగా మంచి పాలన అందించే ముఖ్యమంత్రినే కాంగ్రెస్ తిరిగి ఎన్నుకోవాల్సిన అవసరం ఉన్నది.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు)

భగవంతుడు ప్రత్యక్షమై ఏం వరం కావాలో కోరుకోమంటే.. 'స్వామి! రాత్రికి రాత్రే సోషల్ మీడియాలో సెలబ్రిటీగా మారిపోయే వరం ప్రసాదించండి' అని అడిగాడు భక్తుడు. 'దానికి దేవుని వరాలు పనిచేయవు నాయనా! తెలుగు భాషను ముక్కలు ముక్కలుగా తుంచగలవా? ఒంటి మీదున్న బట్టలను పీలికలుగా చించగలవా? పాట అర్థం కాకున్నా, సంగీతంతో పనిలేకున్నా డ్యాన్సులు దరువేసి దంచగలవా? ఎవరికీ అర్థంకాని భాషల్లో మాట్లాడగలవా? బూతుసాహిత్యం, బూమరాంగ్ డైలాగులు తడబడకుండా చెప్పగలవా? ప్రాణాల మీదికితెచ్చే సాహసాలు చేయగలవా? ఇవన్నీ అందుకు కావలసిన టాలెంట్. ఇక నీ అర్హత అంటావా! చదువు రాకున్నా చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే సరిపోతుంది' అని సెలవిచ్చాడు భగవంతుడు!

స్మార్ట్‌ఫోన్‌తో పరేషాన్!

జోస్యుల వేణుగోపాల్
94404 36806

'ముందుగా నన్ను స్వామి అని పిలవడం మానేసి సామీ! అని పిలువు. ఇక్కడి నుంచే ప్రారంభించు' అంటూ మాయమయ్యాడు సదరు సామీ. అంతే, స్వామిని చూసిన సంతోషంలో ఆ మనిషిలోంచి మనిషి మాయమయ్యాడు. శరీరం ఏదో అద్వితీయ శక్తితో, సంతోషంతో మెలికలు తిరుగుతుంటే మనసు మొత్తం స్మార్ట్‌ఫోన్‌లో దూరి కమిట్‌మెంట్ లేని కంటెంట్ల కోసం సెర్చ్ చేస్తోంది. టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన మొదట్లో మనకు తెలియని విషయాలను గూగుల్ చెవిన వేసి సమాధానాలు రాబట్టుకొని తెలుసుకున్నాం. గూగుల్‌లో శోధన ఎక్కువయ్యాక కమర్షియల్ ఎలిమెంట్లతో విశృంఖలత్వం ఎక్కువైంది. ఈ క్రమంలో అందర్నీ తన కంట్రోల్‌లోకి తెచ్చుకుంది సోషల్ మీడియా.

యూట్యూబ్, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఇతర యాప్‌ల వేదికగా రీల్స్ జనాదరణ పొందుతున్నాయి. వీటిని మెట్లుగా మలుచుకొని పైకి ఎదగాలనుకున్నవాళ్లు తమ టాలెంట్‌ను రకరకాల రీల్స్ రూపంలో ప్రదర్శిస్తూ పాపులర్ అయి డబ్బు, పేరు సంపాదించుకుంటున్నారు. డబ్బు సంపాదన కంటే తమ రీల్స్‌కు మిలియన్ల లైకులు, షేర్స్, సబ్‌స్క్రైబర్లు పెరిగి రాత్రికి రాత్రే సెలబ్రిటీలుగా మారిపోవాలన్నదే చాలామంది యావ. ఈ దుగ్ధతో మహిళలు కూడా సభ్య సమాజం తలదించుకునే వేషభాషలతో అసభ్యకర వీడియోలు చేస్తున్నారు. చేసేవాళ్లు వారి స్వలాభం కోసం రీల్స్ చేస్తుంటే, చూసేవాళ్లు మాత్రం నిద్రాహారాలు మానేసి, విలువైన సమయాన్ని వృథా చేస్తూ 'రీలో రీలో రేలారే' అంటున్నారు.

ఈ రీల్స్ కారణంగా భారతీయత ఉనికి కోల్పోతున్నది. సంప్రదాయం మంటగలిసిపోయి, నాగరికత రూపు మార్చుకొని రచ్చకెక్కుతోంది. లైకుల కోసం చాలామంది రోడ్లపై, నీళ్లలో, రైళ్లలో సాహసాలు చేస్తున్నారు. ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. తమ పిల్లల టాలెంట్‌ను ప్రోత్సహించాలని తల్లిదండ్రులు కూడా చూసీచూడనట్టుగా వదిలేస్తుండటంతో గుర్తింపు పొందాలనే తాపత్రయంలో కొంతమంది ప్రాణాలు కోల్పోతున్నారు. మధ్యప్రదేశ్‌లో ఒక బాలుడు ఉరి వేసుకుంటున్నట్టుగా రీల్ చేయబోయి నిజంగా ఉరి పడి ప్రాణాలొదిలిన ఘటనే అందుకు నిదర్శనం. లక్నోలో వాటర్ టాంక్‌లో రీల్ చేస్తూ ఓ యువకుడు మృత్యువాతపడ్డాడు. బిల్డింగ్‌పై నుంచి దూకడం, బైక్‌లపై ఫీట్లు, చెట్ల కొమ్మల చివరన నిలబడటం, పాము నోట్లో చెయ్యి పెట్టడం లాంటి సాహసాలు రీల్స్ రూపాన్ని సంతరించుకుంటున్నాయి. ఈ రీల్స్ మోజులో పడి ప్రమాదంలో చిక్కుకున్నవారిని కాపాడే బాధ్యతను మానవ సమాజం విస్మరిస్తుండటం బాధాకరం. బాధితుల ఆర్తనాదాలను పట్టించుకోకుండా రీల్స్ చేస్తూ పోస్టు చేస్తుండటం మానవత్వానికి మాయని మచ్చ. ఎదుటివాళ్ల కష్టాలు, నష్టాల నుంచి కూడా ప్రయోజనం పొందాలనుకోవడం దారుణం. సరదాగాకో, ఆటవిడుపు కోసమో రీల్స్ చేయడం తప్పు కాదు. కానీ, అదే వ్యసనంగా మారి జీవితాలను బలి తీసుకునేంత వరకు వెళ్లడం సరికాదు.

రీల్స్ చేసేవారే కాదు, చూసేవారు పరోక్షంగా ఇబ్బందుల పాలవుతున్నారు. నిత్యం రీల్స్ చూస్తూ కాలక్షేపం చేసేవారు మానసిక రుగ్మతలకు గురవుతున్నారు. దేశంలోని సగం జనాభా రోజూ రెండు గంటలకు పైగా సోషల్ మీడియాలో గడుపుతున్నట్టు ఒక అధ్యయనంలో తేలింది. అంతేకాదు, సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం జరుగుతుండటం శోచనీయం. ప్రత్యర్థి రాజకీయ పార్టీలు, నాయకులు, సెలబ్రిటీలు సోషల్ మీడియా ట్రోలింగ్‌కు బాధితులుగా మారుతున్నారు. వారి వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ బతుకుపై విరక్తి కలిగి ఆత్మహత్యల వరకు వెళ్లేలా చేయడం క్షమించరాని నేరం.

కత్తికి రెండువైపులా పదునున్నట్టు.. సోషల్ మీడియా వల్ల లాభనష్టాలు ఉన్నాయి. డిజి